### ఎస్సీల అభ్యున్నతి కోసమే దళితబంధు..

దళితబంధు పైలట్ ప్రాజెక్టులో భాగంగా చింతకాని మండలాన్ని ఎంపిక చేశామని, మధిర ఎమ్మెల్యే భట్టి విక్రమార్క అడిగితేనో, ధర్నా చేస్తేనో, దరఖాస్తు చేస్తేనో ఎంపిక చేయలేదని సీఎం స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజును గెలిపించుకుంటే, నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన దళిత కుటుంబాలకు పథకం వర్తింపజేస్తామని మాట ఇచ్చారు.



మధిర సభకు హాజరైన జనం

- 'లింగాల' గెలుపు.. అభివృద్ధికి మలుపు
- ఎమ్మెల్యే 'భట్టి'తో ప్రజలకు పైసా ప్రయోజనం లేదు..
- ఆయనకు చుట్టపుచూపు కోసమే నియోజకవర్గం
- ఇందిరమ్మ రాజ్యం వస్తే ఎమర్జెన్సీ పరిస్థితులే..
- బీఆర్‌ఎస్ పాలనలోనే మానవతా దృక్పథం
- గెలిచిన తర్వాత అన్ని మండలాలకూ దళితబంధు
- మధిర ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

## బీఆర్‌ఎస్ గెలిస్తేనే..

# సాగు జలాలు.. సంక్షేమ ఫలాలు..

ఖమ్మం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ గెలిస్తేనే మధిరకు సాగు జలాలు వస్తాయని, దళితబంధు వంటి సంక్షేమ పథకాలు అమలువుతాయని ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు. మధిరలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ అభ్యర్థి అయిన స్థానిక ఎమ్మెల్యే భట్టి విక్రమార్కతో ప్రజలకు పైసా ప్రయోజనం ఉండదని, చుట్టపు చూపుగా వచ్చి నియోజకవర్గాన్ని చూసి వెళ్తారని విమర్శించారు. తానే ముఖ్యమంత్రినవుతానంటూ ప్రజలను ఆయన మభ్యపెట్టే పనిలో ఉన్నారని విమర్శించారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తామని, కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తున్నదని అన్నారు. కానీ ఆ పాలనలో ప్రజలు ఎమర్జెన్సీని ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి 20 స్థానాలకు మించి రావన్నారు.

**ధరణి లేకుంటే రైతులకు కష్టాలే..**

ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామంటూ మధిర ఎమ్మెల్యే భట్టి మాట్లాడుతున్నారని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో 'భూమాత' అనే పోర్టల్‌ను తెస్తామంటున్నారని అన్నారు. ఇదే జరిగితే రైతులకు మళ్లీ కష్టాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలకు కేవలం మూడు గంటల కరెంట్ ఇస్తే చాలంటూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అంటున్నారని, రైతుబంధు దుబారా అంటూ మరో కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారని గుర్తు చేశారు. '24 గంటల కరెంట్ కావాలా? మూడు గంటల కరెంట్ కావాలా? రైతుబంధు లేకపోతే ఫర్వాలేదా? ధరణి కావాలా.. వద్దా..?' అని సీఎం కేసీఆర్ ప్రజలను అడిగారు. వెంటనే ప్రజలు పెద్దఎత్తున 'రైతుబంధు, ధరణి, 24 గంటల కరెంట్ కావాలి..' అంటూ నినదించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఆషామాషీగా ప్రకటించలేదని, 'కేసీఆర్ శవయాత్రో.. తెలంగాణ జైత్రయాత్రో' అంటూ తాను పోరాడి, 36 పార్టీలను ఏకం చేసి ఉద్యమిస్తేనే కాంగ్రెస్ పార్టీ స్పందించిందని గుర్తుచేశారు.

**రైతులను ఆదుకున్నాం..**

మార్చి నెలలో నియోజకవర్గంలో అకాల వర్షం కురిసి పంటలు దెబ్బతిన్నాయని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. తాను స్వయంగా బోనకల్లు మండలంలో బాధిత రైతులను పరామర్శించామన్నారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందించామన్నారు. అభ్యర్థుల గుణగణాలతోపాటు వారిని బలపరిచే పార్టీల నడవడిక, దృక్పథాన్ని గమనించాలని కోరారు. చెప్పుడు మాటలు, తప్పుడు మాటలు విని ఓటు వేయవద్దని సూచించారు.

### కాంగ్రెస్ గెలిస్తే చీకట్లే..

కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రంలో కరెంటు కాటుగలుస్తుందని సీఎం కేసీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. నగర ప్రాంత ప్రజలకు విద్యుత్ సరఫరా గతంలో ఇప్పటి ఏపీలోని చిల్లకల్లు నుంచి జరిగేదని, విద్యుత్ సరిగా అందక వినియోగదారులు ఇబ్బందిపడేవారని గుర్తుచేశారు. తాను అక్కడి ఫీడర్‌ను ఖమ్మం జిల్లాకు తెచ్చి సమస్యను పరిష్కరించానని గుర్తుచేశారు. కాంగ్రెస్ రాజ్యంలో రాక్షసకోణం ఉంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మానవతా దృక్పథం ఉంటుందని అన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి పాలేరుకు అనుసంధానం చేస్తామన్నారు. 37 టీఎంసీల సామర్థ్యంతో కడుతున్న సీతమ్మ సాగర్ అందుబాటులోకి వస్తే మధిరకు కరవంటూ ఉండదని అన్నారు. సభకు బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు అధ్యక్షత వహించారు. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర రావు, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తాతా మధు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కృష్ణచైతన్య పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభలు విజయవంతం

- మధిర, వైరాలకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, శ్రేణులు
- అభివృద్ధి బాధ్యత తనదేనంటూ ప్రజలకు సీఎం భరోసా

ఖమ్మం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మధిర, వైరా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ నేతలు నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు జన ఉప్పెనను తలపించాయి. ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హాజరైన ఈ సభలకు జనం ప్రభంజనంగా తరలిరావడంతో ఆ పార్టీ నాయకుల్లో జోష్ నెలకొంది. ప్రగతి ప్రదాతను చూసేందుకు ఆయా సభలకు నిర్ణీత సమయానికంటే 2 గంటల ముందే ప్రజలు, అభిమానులు వచ్చి ఓపికగా వేచి చూశారు. సీఎం ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. మధిర సభలో అక్కడి ఎమ్మెల్యే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రస్తావనను సీఎం తీసుకొచ్చినప్పుడల్లా, వంగ్యాస్త్రాలు సంధించినప్పుడల్లా ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం మరొకరిని చేయమంటే సాధ్యం కాదని, ఈసారి భట్టివిక్రమార్కను ఓడించి కమల్‌రాజును గెలిపిస్తేనే అది సాధ్యమవుతుందని సీఎం ప్రస్తావించినప్పుడు ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు. దివంగత కమ్యూనిస్టు నేత బోడేపూడి వెంకటేశ్వరరావు ప్రస్తావన తెచ్చినప్పుడు కూడా ప్రజల నుంచి అదే స్పందన లభించింది. వైరా సభలో కూడా ఇదే ప్రస్ఫుటమైంది. ఈ జిల్లాకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు తమ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనివ్వబోమంటూ మాట్లాడుతున్నారని అన్నారు. అసలు అసెంబ్లీ గేటు దాటనీయకపోవడానికి వారెవరని ప్రశ్నించారు. వీరి కోట్లాది రూపాయల డబ్బు హైదరాబాద్‌లో పట్టుబడిందని ప్రచారం జరుగుతోందని అన్నారు. కానీ కోట్లాది విలువైన ఓటు ద్వారా బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించి నోట్ల స్వాములకు బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున కరతాళ ధ్వనులు వినిపించారు. వైరా, మధిరల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ఈ ప్రాంతాల అభివృద్ధికి తాను బాధ్యత తీసుకుంటానని అన్నారు.

### కేసీఆర్ నాకు రాజకీయ పునర్జన్మనిచ్చారు: బీఆర్‌ఎస్ అభ్యర్థి కమల్‌రాజు



మధిర, నవంబర్ 21: సీఎం కేసీఆర్ తనకు రాజకీయ పునర్జన్మనిచ్చారని బీఆర్‌ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి లింగాల కమల్‌రాజు స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ తనకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని అప్పగించి ప్రజలకు సేవచేసే అవకాశాన్ని కల్పించారని అన్నారు. ఈ పదవి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించానని అన్నారు. ఇంతటి ఆశీస్సులు అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఈ సభా వేదిక ద్వారా పాదాభివందనాలు చేస్తున్నానని అన్నారు. కేసీఆర్ మూడోసారి కూడా సీఎం అవుతారని స్పష్టంచేశారు. అయితే ఆయన పక్కనే ఎమ్మెల్యేగా కూర్చొనే అవకాశాన్ని మధిర ప్రజలు తనకు కల్పించాలని కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి తనకు ఆ అవకాశాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు.

- కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యమంటే కరువు కాటకాలు, ఆకలి చావులే కదా..
- వాళ్లు రూ.కోట్లతో ఓట్లు కొంటరంట.. మీరు కోట్లాది ఓట్లు కారు గుర్తుకేయండి..
- 'సీతారామ'పై 'తుమ్మల' మాటలు విడ్డూరం.. ఆయన అప్పుడెందుకు కట్టలేదు?
- ఇంకొకాయన అసెంబ్లీ గేటు తానివ్వడంట.. తాకనిచ్చేది మీరని తెల్వదనుకుంట..
- రాములునాయక్ చాలా మంచి మనిషి.. ప్రభుత్వంలో మంచి హోదా కల్పిస్తాం..
- రైతుబంధు పథకం నిలబడాలంటే ఇక్కడ బానోత్ మదన్‌లాల్‌ను గెలిపించండి..
- వైరా నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

# ఆ దిక్కుమాలిన పాలన వద్దు



వైరా సభలో పాల్గొన్న జనసందోహం

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ నేతలు చెబుతున్న ఇందిరమ్మ రాజ్యమంటే కరువు కాటకాలు, ఆకలి చావులేనని ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. అలాంటి దిక్కుమాలిన పాలన మనకు అవసరం లేదని తేల్చిచెప్పారు. ఇప్పటికే 50 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని విమర్శించారు. వైరాలో మంగళవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైరా ఎమ్మెల్యే రాములునాయక్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదనలాల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీఎం ఆయన ప్రసంగించారు. ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైన ఓటును మంచి వ్యక్తిని ఎన్నుకునేందుకు వినియోగించుకోవాలని సూచించారు. ఆ ఓటుతోనే ఐదేళ్ల భవిష్యత్‌ను నిర్మించుకోవాల్సి ఉంటుందని అన్నారు. అప్పుడు గ్రామ పంచాయతీగా ఉన్న వైరాను బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మున్సిపాలిటీ చేశామని గుర్తుచేశారు. కరువుతో అలమటించిన జూలూరుపాడు, కారేపల్లి, ఏన్కూరు మండలాల్లో నేడు సిరులు కురిపిస్తున్నామని అన్నారు.

**తాగునీటి సమస్యనూ తీర్చలేని కాంగ్రెస్..**

ఇప్పుడు ఇంత గొప్పలు చెబుతున్న కాంగ్రెస్.. మరి ఆ నాడు గోదావరిపై ఒక్క ప్రాజెక్టునూ కట్టలేకపోయిందని విమర్శించారు. తెలంగాణ వచ్చాకే సీతారామ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే 70 శాతం పనులు పూర్తి చేశామని అన్నారు. సీతారామ గురించి మాజీ మంత్రి తుమ్మల మాట్లాడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అలాంటి ప్రాజెక్టును ఆయన అప్పుడే ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. అలాగే ఇక్కడి బీఆర్‌ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనివ్వబోమంటూ ఇంకొకాయన అంటున్నాడని, గేటు తాకనిచ్చేది ప్రజలు అనే విషయం ఆయనకు తెలియదనుకుంట అని విమర్శించారు.

**మదన్‌లాల్‌ని గెలిపించండి..**

బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దాన్ని సాక్షాత్కరిస్తూ అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు చేరుతున్నాయని అన్నారు. రైతుల కోసం రైతుబంధు పెట్టామన్నారు. ఆ పథకం నిలబడాలంటే ఇక్కడ మదన్‌లాల్‌ను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో 3,650 మంది పోడు రైతులకు 7,140 ఎకరాలపై హక్కులు కల్పించి పట్టాలు అందించామని వివరించారు. నోట్ల కట్టలతో వచ్చి ఓట్లు కొనాలని వాళ్లు చూస్తున్నారని విమర్శించారు. కానీ ప్రజలు మాత్రం కోట్లాది ఓట్లను కారు గుర్తుకు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.

**వైరా సమస్యలు పరిష్కరిస్తాం..**

నియోజకవర్గంలోని కొన్ని సమస్యలను తమ పార్టీ అభ్యర్థి మదన్‌లాల్ తన దృష్టికి తెచ్చారని అన్నారు. అవి చాలా చిన్నవని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరిస్తామని అన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే రాములునాయక్ చాలా మంచి మనిషి అని అన్నారు. వచ్చే ప్రభుత్వంలో ఆయనకు మంచి హోదా కల్పిస్తానని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటెయ్యాలని పిలుపునిచ్చారు. ఇక్కడ మదన్‌లాల్ గెలిస్తే అక్కడ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని స్పష్టంచేశారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నేతలు కొండబాల కోటేశ్వరరావు, సంభాని చంద్రశేఖర్, నాగభూషణం, దొండపాటి వెంకటేశ్వరరావు, బంధం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన బాంధవుడు సీఎం కేసీఆర్: వైరా ఎమ్మెల్యే రాములునాయక్

గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించిన సీఎం కేసీఆర్ గిరిజన బాంధవుడయ్యారని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ పేర్కొన్నారు. తెలంగాణ రాకముందు ఇక్కడి పరిస్థితి ఎలా ఉండేదో ఇక్కడి ప్రజలకు తెలియనిది కాదని అన్నారు. తాగు నీటికి, సాగునీటికి పడిన ఇబ్బందులన్నీ ఇక్కడి ప్రజలకు గుర్తే ఉన్నాయని అన్నారు. అలాంటి కాంగ్రెస్ పాలన మళ్లీ రాకూడదు కాబట్టే ప్రజలు మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

### లబ్ధిదారుల ఖాతాల్లోకే సంక్షేమ ఫలాలు: బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్

సంక్షేమ పథకాలు లబ్ధిదారుల ఖాతాల్లోనే నేరుగా వాటి ఫలాలను జమ చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ అభ్యర్థి మదన్‌లాల్ పేర్కొన్నారు. గత కాంగ్రెస్ పాలనలో పథకాలన్నీ పైరవీకారుల జేబుల్లోకే వెళ్లేవని గుర్తుచేశారు. వైరా నియోజకవర్గంలో గతంలో పరిశ్రమలు లేవని, కేసీఆర్ సీఎం అయ్యాకే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వచ్చిందని అన్నారు. నియోజకవర్గంలోని దళితులందరికీ ఏకకాలంలోనే దళితబంధు పథకాన్ని అమలు చేయాలని కోరారు.